ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 33.0
కనిష్ఠం 23.4

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

శుక్రవారం 30 ఆగస్టు 2024


ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	590 (312.0450)	3,48,235	3,55,910
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.40 (4.04)	507.74	502.74
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.74 (45.36)	2,75,393	3,40,393

చికెన్ ధరలు | లైవ్ : రూ.139 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

చేనేతను ప్రోత్సహించాలి

● జిల్లాలో ప్రపంచస్థాయి ప్రముఖులు ఉండటం గర్వకారణం ● జిల్లాకు అత్యధిక అవార్డులు రావడం అభినందనీయం ● ఉపాధి పనుల్లో ప్రగతి భేష్ ● గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



కలెక్టరేట్‌లో చర్చాగోష్ఠిలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

యాదాద్రి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలను, ఆ కళను కాపాడుతున్న కార్మికులను ప్రోత్సహించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక ఆలయాలతోపాటు వివిధ రంగాల్లో రాష్ట్రంలో ప్రముఖంగా అవార్డులు పొందిన జిల్లాగా యాదాద్రి భువనగిరి వెలుగొందుతుందని కొనియాడారు. జిల్లాలో ప్రముఖ ఆలయాలకు నిత్యం వందలాది మంది దర్శనం నిమిత్తం వస్తున్నారని, అంతర్జాతీయ స్థాయిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొందన్నారు. వివిధ రంగాల్లో జిల్లాకు చెందిన ప్రముఖులు అవార్డులు పొందడం అభినందనీయమని, అన్ని రంగాల్లోనూ జిల్లా అభివృద్ధి పథంలో పురోగమిస్తుందన్నారు. ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలోనే అత్యధికంగా కూలీలకు పని కల్పించడం గర్వించదగ్గ విషయమన్నారు. స్వయం సహాక సంఘాలు పనితీరు బాగుందని, మహిళలు ఎప్పటికప్పుడు రుణాలు సకాలంలో చెల్లిస్తున్నారని తెలిపారు. చేనేత సంస్కృతి చాలా గొప్పదని, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే కళాకారులు జిల్లాలో ఉండటంబ గర్వకారణమని వారి సేవలను కొనియాడారు. చేనేత వస్త్రాలను ధరించి, వారి కళారూపాలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయ భాగస్వామ్యంతో పనిచేయడం అభినందనీయమని తెలిపారు.

ప్రముఖులకు గవర్నర్ సన్మానం...

స్వాతంత్ర్య సమరయోధులు మన్నె గోపాల్‌రెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహితలు కూరెళ్ల విఠలాచర్య, కేతావత్ సోమ్లానాయక్‌లను గవర్నర్ వారి వద్దకు వచ్చి శాలువాతో సత్కరించారు. వివిధ రంగాల్లో ప్రసిద్ధులైన జిల్లాకు అవార్డు గ్రహితలను అభినందించారు. వారు కృషి రంగాల్లో సాధించిన ఫలితాలను గవర్నర్ ప్రత్యేకం అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ హనుమంతు కే.జెండగే జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలవుతోన్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. జిల్లాకు విచ్చేసిన గవర్నర్‌కు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు జెండగే, అదనపు కలెక్టర్లు బెన్ షాలోమ్, గంగాధర్, డీసీపీ రాజేశ్‌చంద్ర, తదితరులు స్వాగతం పలికారు.

కలెక్టరేట్‌లో గవర్నర్‌తో చర్చా గోష్ఠి

కలెక్టరేట్‌లో గవర్నర్ చర్చా గోష్ఠిలో పాల్గొన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహితలు గజం గోవర్ధన్, గజం అంజయ్య, చింతకింది మల్లేశం, డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్లానాయక్, సంత్ కబీర్ అవార్డు గ్రహిత జెల్లా వెంకటేశం, కేంద్రసాహిత్య అకాడమీ గ్రహిత ఆచార్య ఎన్.గోపి, భువనగిరి కేంద్ర సాహిత్య యువ పురష్కార గ్రహిత డాక్టర్ గడ్డం మోహన్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ యువ పురష్కార గ్రహిత తిరునగరి శ్రీనివాస్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత నిఖిలేశ్వర్, రాష్ట్ర ప్రభుత్వ కాళోజీ పురస్కార్ గ్రహిత రామోజు హరగోపాల్, పర్వతారోహకురాలు పడమటి అన్వితారెడ్డి, భువనగిరి స్వతంత్ర సమరయోధులు మన్నె గోపాల్‌రెడ్డి, నంది అవార్డు గ్రహిత ఎండీ అబ్దుల్, జాతీయ ఉత్త సినీగేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ, రాష్ట్ర ప్రభుత్వ విశిష్ట పురస్కార గ్రహితలు అభినయ శ్రీనివాస్, కడారి శ్రీనివాస్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత డాక్టర్ దేవరాజు మహారాజు, శరత్‌చంద్ర, చటోపాధ్యాయ జాతీయ పురస్కార గ్రహిత డాక్టర్ షేక్ అబ్దుల్ ఘని, కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డు గ్రహిత డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం పురస్కార గ్రహిత లింగంపల్లి రామచంద్ర, తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గవర్నర్ ఆలేరు మండలం కొలనుపాకలోని జైనమందిరాన్ని, సోమేశ్వరాలయం, భువనగిరిలోని స్వర్ణగిరిలోని వెంకటేశ్వరుని ఆలయాలను దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గవర్నర్‌కు పూర్ణకుంభంతో పాటు బతుకమ్మ, బోనాలు, కోలాటలతో స్వాగతం పలికారు.ముందుగా గవర్నర్ స్వామివారి పాదాలను, ఆలయంలోని పద్మావతి, ఆలివేలు మంగమ్మని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని ఆదిమూల మహాగణపతిని దర్శించకుని, కన్యాకాపరమేశ్వరి అమ్మవారిని, 21అడుగుల ఏకశిలా హనుమంతుడి విగ్రహాన్ని దర్శించుకున్నారు.



ఆలేరు మండలం కొలనుపాకలో సోమేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్



కలెక్టరేట్‌లో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో కూరెళ్ల విఠలాచార్య

రైతు వేదికలకు నిధులేవీ?

● ఏఈవోలపై రైతు వేదికల నిర్వహణ భారం ● నెలకు ఇచ్చేదే రూ.9 వేలు
● 24 నెలలుగా నిధులివ్వని ప్రభుత్వం ● ఉమ్మడి జిల్లాలో 314 రైతు వేదికలు



అడ్డగూడూరు క్లస్టర్ రైతు వేదిక

మోత్కూరు, ఆగస్టు 29: బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన రైతు వేదికలను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంటున్నప్పటికీ దాని నిర్వహణ, అందులో కనీస వసతులు గురించి పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైతు వేదికలు నిర్మించి మూడున్నరేళ్లు అవుతున్నా పలు రైతు వేదికల్లో నేటికీ మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. నీటి వసతి లేదు. రైతు వేదికలు నిర్మించిన ఏడాది తర్వాత ఇవ్వడం ప్రారంభించిన నిర్వహణ ఖర్చులు కూడా బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు నెలనెలా ఇవ్వకపోవడంతో ఏఈవోల తమ వేతనాల్లోంచి ఖర్చుచేస్తున్నారు. ప్రభుత్వాన్ని అడుగలేక, ఖర్చులు భరించలేక అష్టకష్టాలు పడుతున్నారు.

ఐదువేల ఎకరాలకు ఒక క్లస్టర్ ఏర్పాటు

బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదువేల ఎకరాలకు ఒక వ్యవసాయ క్లస్టర్‌ను ఏర్పాటుచేసి ఒక్కో క్లస్టర్‌లో రూ.22లక్షల నిధులతో రైతు వేదిక నిర్మించింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 92, సూర్యాపేట జిల్లాలో 82, నల్లగొండ జిల్లాలో 140 రైతు వేదికలు నిర్మించారు. రైతు వేదికలు ప్రారంభించి మూడున్నరేళ్ల అవుతున్నా పలు రైతు వేదికలకు మరుగుదొడ్లు, మూత్రశాలల సౌకర్యం లేదు. కొన్ని చోట్ల నిర్మాణాలు జరిగినా నీటి సౌకర్యం లేక నిరపయోగంగా ఉంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మండలానికో రైతు వేదికలో టీవీలను అమర్చి వీడియో కాన్ఫరెన్సులు నిర్వహిస్తోంది. వీడియో కాన్ఫరెన్సులు నిర్వహిస్తున్న మోత్కూరు మండలం పాటిమట్ల రైతు వేదికలో మూత్రశాల, మరుగుదొడ్డి సౌకర్యం లేక రైతులు, సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు రైతు వేదికల్లో ఇదే దుస్థితి ఉంది. పలు రైతు వేదికల్లో కిటికీలకు తలుపులు అమర్చకపోవడంతో వర్షపు జల్లులు లోనికి రాకుండా ఫ్లెక్సీలు అడ్డుకట్టుకున్నారు.

రెండేళ్లుగా నిర్వహణ ఖర్చులు ఇవ్వని ప్రభుత్వం

రైతుల వేదికలు 2021 మార్చిలో ప్రారంభించారు. ప్రారంభించిన తర్వాత ఏడాదిపాటు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి నిర్వహణ ఖర్చులు ఇవ్వలేదు. 2022 ఏప్రిల్ నుంచి ఒక్కో రైతు వేదికకు నెలకు రూ.9వేలు నిర్వహణ ఖర్చులు ఇస్తామని ప్రకటించింది. 2022 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు మాసాలు మాత్రమే నిర్వహణ ఖర్చులు ఇచ్చారని ఏఈవోలు చెబుతున్నారు. ఆ తర్వాత నేటి వరకు రెండేళ్లుగా నిర్వహణ ఖర్చులు ఇవ్వడంలేదంటున్నారు. పరిశుభ్రతకు రూ.3వేలు, శిక్షణకు రూ.2500, స్టేషనరీ రూ.వెయ్యి, కరెంటు బిల్లు రూ.వెయ్యి, మరమ్మతులు రూ.వెయ్యి, తాగునీటికి రూ.500చొప్పున మొత్తం నెలకు రూ.9వేలు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం నెలకు ఇచ్చే రూ.9 వేలు సరిపోక అప్పుడప్పుడు తమ జేబులకు చిల్లులు పడుతుండగా, రెండేళ్లుగా ఖర్చులకు నిధులు విడుదల చేయకుంటే తామెలా ఖర్చులు భరించాలని ఏఈవోలు ఆవేదన చెందుతున్నారు. ఎవరికీ చెప్పలేక, ప్రభుత్వాన్ని అడగలేక ఏఈవోలు తమలో తామే మదనపడుతున్నారు.

వారం వారం వీడియో కాన్ఫరెన్సులు

రాష్ట్ర ప్రభుత్వం రైతు వేదికల్లో ప్రతీ మంగళవారం రైతులకు వీడియో కాన్ఫరెన్సులు నిర్వహిస్తోంది. వీటికి రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరవుతున్నారు. వారికి టీ ఖర్చులు తామే భరించాల్సి వస్తున్నంటున్నారు. వెంటనే ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని ఏఈవోలు కోరుతున్నారు.

నేడు ఐటీఎఫ్ అండర్-18 సెమీ ఫైనల్స్

● డబుల్స్ ఫైనల్స్ కూడా నేడే ● సెమిస్ సింగిల్స్, డబుల్స్‌లో ఎనిమిది జట్ల చొప్పున పోటీ

భువనగిరి టౌన్, ఆగస్టు 29: భువనగిరిలో సాగుతున్న ఐటీఎఫ్ అండర్-18 టెన్నిస్ సిరీస్‌లో సింగిల్స్‌లో ఎనిమిది మంది బాలబాలికలు, డబుల్స్‌లో ఎనిమిది జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరాయి. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్ పోటీపోటాగా సాగాయి. ప్రపంచ ర్యాంక్ మెరుగు పరుచుకోవడమే లక్ష్యంగా, ప్రత్యర్థులపై పైచేయి సాధించేందుకు చివరి పాయింట్ వరకు క్రీడాకారులు చెమటోడ్చారు. అయితే మరికొన్ని మ్యాచ్‌లు ఏకపక్షంగా కూడా జరిగాయి. శుక్రవారం అన్ని కేటగిరీల సెమి ఫైనల్స్‌తోపాటు డబుల్స్ ఫైనల్స్ కూడా జరుగనున్నాయి. చివరిరోజు శనివారం సింగిల్స్ ఫైనల్స్ జరుగుతాయి. అదే రోజు సిరీస్ ముగింపు వేడుకలు నిర్వహించనున్నారు. అయితే భువనగిరిలో నిర్వహిస్తున్న అండర్-18 టెన్నిస్ సిరీస్ లక్ష్యాన్ని సాధించిందని, యువ క్రీడాకారుల్లోని ప్రతిభ వెలుగు చూసిందని, ముఖ్యంగా భారత యువ కెరటాలు సత్తా చాటేలా పోటీలు సాగాయి. టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొంటున్నారు. అలాగే సిరీస్ నిర్వహణ తీరు ఏర్పాట్లపై క్రీడాకారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారిణి

మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా పోస్టులన్నీ భర్తీ



ఇంటర్వ్యూ వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ గంగాధర్

● అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి టౌన్, ఆగస్టు 29: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో వైద్యులు సహా అన్ని కేటగిరీల పోస్టులను ప్రభుత్వం త్వరలో భర్తీ చేయనున్నదని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. భువనగిరి జిల్లా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేయనున్న వైద్యుల పోస్టులకు గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోస్టుల భర్తీ, మౌలిక వసతుల కల్పన పూర్తయ్యాక వైద్య చికిత్సల కోసం భువనగిరి జిల్లా ఆస్పత్రి నుంచి ఇతర ఆస్పత్రులకు రెఫరల్స్ ఉండవన్నారు. ఉద్యోగం లభించిన వైద్యులు విధుల నిర్వహణలో చిత్తశుద్ధి చూపాలన్నారు. ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రాజారావు, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ చిన్నా నాయక్ తదితరులు ఇంటర్వ్యూలను పరిశీలించిన వారిలో ఉన్నారు.

ప్రధాన స్టేషన్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి : ఎంపీ

భువనగిరి టౌన్, ఆగస్టు 29: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పనుల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం నియోజకవర్గంలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం దక్షిణ భారత రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌తో హైదరాబాద్‌లో ఎంపీ సమావేశమయ్యారు. తిరుపతి వెళ్లే భక్తుల సౌకర్యార్థం భువనగిరిలో పద్మావతి, భువనగిరి, ఆలేరు, జనగామ స్టేషన్లలో మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలును ఆపాలన్నారు. వరంగల్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే కాకతీయ రైలు ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య జనగామ, ఆలేరు, భువనగిరి రైల్వే స్టేషన్ల గుండా ప్రయాణించేలా సమయాన్ని సవరించాలని, రైల్వే ఫ్రీక్వెన్సీని పెంచాలన్నారు. సికింద్రాబాద్ వరంగల్ మధ్య నడిచే పుష్‌పుల్ రైలును గతంలో మాదిరిగా ప్రతీరోజు నాలుగుసార్లు నడపాలన్నారు. ఈ మార్గంలో ప్రయాణించే మధ్య తరగతి ప్రయాణికులు, చిరు వ్యాపారులకు, విద్యార్థులు, ఉద్యోగులకు బస్సులతో పోలిస్తే రైలు ప్రయాణ చార్జీలు తక్కువగా ఉండి ఆర్థిక భారం తప్పుతుందన్నారు. సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, రోడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రైల్వే జీఎంతో ఎంపీల సమావేశంలో పాల్గొన్న కిరణ్‌కుమార్‌రెడ్డి

త్రిపుల్‌ఆర్
భూ నిర్వాసితులకు న్యాయంచేయాలి

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరిన జూలకంటి రంగారెడ్డి

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 29: చౌటుప్పల్ పట్టణంలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేయనున్న త్రిపుల్‌ఆర్ జంక్షన్‌లో ఆస్తులను కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సీపీఎం రాష్ట్రనేత జూలకంటి రంగారెడ్డి కోరారు. జూలకంటి రంగారెడ్డి ఆధ్వర్యంలో గురువారం నల్లగొండలో మంత్రి వెంకట్‌రెడ్డిని భూనిర్వాసితులు కలిశారు. ఆస్తులకు ఆస్తులు లేదా 2012 భూసేకరణ చట్టం ద్వారా ఓపెన్ మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని మంత్రిని కోరారు. పంటలు సాగు చేసుకొని జీవనం సాగించే భూములను కోల్పోతుండడంతో రైతులకు జీవనోపాధి కరువవుతోందని అన్నారు. ముఖ్యమంత్రితో చర్చించి తగిన న్యాయం జరిగే విధంగా ప్రయత్నిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు రంగారెడ్డి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సీపీఎం చౌటుప్పల్ కార్యదర్శి బండారు నర్సింహ, భూ నిర్వాసితులు ఉన్నారు.



మంత్రి కోమటిరెడ్డికి సమస్యను వివరిస్తున్న జూలకంటి రంగారెడ్డి

యాదగిరీశుడికి లక్ష పుష్పార్చన



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 28: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వైజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకస్వాములు ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామా పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. పాంచరాత్రాగమన రీతిలో గంట పాటు పూజ పర్వం కొనసాగింది. ఆలయంలో కణ్ణన్ తిరునక్షత్రోత్సవాల్లో భాగంగా సాయంత్రం ఉట్లోత్సవం ఉదయం గోశాలలో గోపూజలు వేదమంత్ర పఠనాల నడువ అర్చకస్వాములు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం జరిగిన ఉట్లోత్సవంలో తూర్పురాజగోపురం నుంచి స్వామి అమ్మవార్ల సేవ రాగా ఎదురుగా భక్తులు ఉట్టి కొట్టారు. ఆలయ ఈవో భాస్కర్‌రావు ప్రారంభించారు. అంతకు ముందు ప్రధానార్చకుడు నల్లం థీగల్ లక్ష్మీనరసింహ చార్యులు వేద మంత్రోచ్ఛరణలు ఆస్థాన విద్వాంసుల నడుమ ప్రత్యేక వేదికపై స్వామిఅమ్మవార్లను అధిష్టింపజేసి హారతి ఇచ్చారు. అదేవిధంగా ఉదయం మల్లాపురం గోశాలలో గోపూజలో ఈవో ఏ. భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, డీఈవో భాస్కరశర్మ, ఏఈవో దూశెట్టి క్రిష్ణ, పర్యవేక్షకుడు రామరావు పాల్గొన్నారు. శ్రావణ మాసంలో చివరి శుక్రవారం ఉచిత వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. మూడు రోజులుగా ఆలయ అధికారులు ఉచిత వ్రతాలపై ప్రచారం చేపట్టగా సుమారు 200మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. కొండకింద వ్రత మండపంలో శుక్రవారం జరినే వ్రతాలు భక్తులు పాల్గొని అమ్మవారి మొక్కుల తీర్చుకోవాలని కోరారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

స్వామివారి ఆలయంలో నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమ్రం పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్టింపజేసి విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులను అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వ రస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 40,12,733 ఆదాయం సమకూరిందని ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

వచ్చేనెల 1న ఖోఖో జిల్లా జట్ల ఎంపిక

దామరచర్ల, ఆగస్టు 29: ఉమ్మడి నల్లగొండ జిల్లా సబ్ జూనియర్ ఖోఖో బాలబాలికల జట్ల ఎంపికను వచ్చే నెల 1వ తేదీన నల్లగొండ జిల్లా దామరచర్ల మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులను జిల్లా ఖోఖో సంఘం బాద్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఖోఖో కోచ్‌లు ఎంపికలో పాల్గొనాలన్నారు. క్రీడాకారులు తమ వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు పత్రాలతో హాజరు కావాలని అన్నారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరు 13, 14, 15వ తేదీల్లో ఖమ్మం జిల్లా కల్లూరులో జరిగే 34వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వివరాలకు నాతి కృష్ణమూర్తి 9866368843, ఎస్.నాగేశ్వర్‌రావు 6300085314, డి.స్వాతి 9912754498 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత ఆత్మహత్య

దేవరకొండ, ఆగస్టు 29: అనుమానాస్పద స్థితిలో వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జాల రజిత(30) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త దుర్గయ్య పశువులను కాసేందుకు వెళ్లాడు. రజిత ఇద్దరు పిల్లలు బుధవారం పోచంపల్లి గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. రజిత తమ్ముడు రమేష్ పిల్లలను తీసుకొని గురువారం ముల్కలపల్లికి వచ్చాడు. అప్పటికే రజిత రాగా ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రజిత మృతిపై గ్రామానికి చెందిన జాల రాములుపై అనుమానం ఉన్నట్లు భర్త దుర్గయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడు..

దేవరకొండ, ఆగస్టు 29: ఉరి వేసుకొని యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని కట్టవారిగూడెంలో గురువారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ జుబేర్(25) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్య కారణాల వల్ల ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నవదంపతుల అపహరణ

- *పోలీసు వాహనం నుంచి తప్పించిన యువతి బంధువులు*
- *యువకుడికి ప్రాణహాని ఉందని బంధువుల ఆందోళన*

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 29: ప్రేమ వివాహం చేసుకొని పోలీసుల బందోబస్తుతో ఇంటికి వెళ్తున్న ప్రేమజంటను గురువారం రాత్రి సినీ ఫక్కీలో యువతి బంధువులు అపహరించారు. వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తాళ్లసింగారం గ్రామానికి చెందిన యువకుడు, రామన్నపేట మండలం ఎల్లంకి గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి ఇటీవలే దేవాలయంలో పెళ్లిచేసుకున్నారు. పెళ్లికి ఇరువురి కుటుంబసభ్యులు అంగీకరించలేదు. గురువారం ప్రేమజంట పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు ఇరువురి కుటుంబసభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా యువతి తరుపు కుటుంబసభ్యులు అంగీకరించలేదు. తాను తన భర్తతోనే ఉంటానని యువతి చెప్పింది. తమకు ప్రాణహాని ఉందని పోలీసులు తమకు రక్షణ కల్పించి ఇంటింకి పంపించాలని నవ దంపతులు పోలీసులను కోరారు. ఆ దంపతులను పోలీసులు రాత్రి పెట్రోలింగ్ వాహనంలో ప్రియుడి ఇంటికి పంపిస్తుండగా సినీ ఫక్కీలో యువతి బంధువులు మార్గమధ్యలో పోలీసు వాహనాన్ని అడ్డుకుని, ప్రేమజంటను అపహరించారు. గ్రామానికి వచ్చిన పోలీసు వాహనాన్ని తాళ్లసింగారం గ్రామస్థులు, యువకుడి బంధువులు అడ్డుకున్నారు. మీ సమక్షంలో ఉన్న ప్రేమజంటను ఎలా వదిలివేశారని, తమ కుమారుడిని వాళ్లు చంపివేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంత నచ్చచెప్పినా వినిపించుకోకుండా ఆందోళన కొనసాగించారు. ఈ విషయంపై సీఐ మన్మధరావును ప్రశ్నించగా యువకుడు క్షేమంగానే ఉన్నాడని తెలిపారు. ఆ యువతి తన తల్లి తండ్రుల సమక్షంలో ఉందని పేర్కొన్నారు. యువతి కుటుంబసభ్యులపై కేసు నమోదు చేస్తామని చెప్పారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు..?

కట్టంగూర్, ఆగస్టు 29: పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ఓ వ్యక్తి నుంచి 12తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా కట్టంగూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు తెలిసిన వివరాలిలా ఉన్నాయి. కట్టంగూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లగొండ క్రాస్ రోడ్డు సమీపంలో పోలీసులు రోజు మాదిరిగానే వాహనాల్లో పెట్రోలింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఓ గుడి వద్ద ముగ్గురు అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా కన్పించారు. పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని గమనించిన ఇద్దరు పారిపోగా ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పట్టుబడిన వ్యక్తిని విచారించే క్రమంలో అతని వద్ద సుమారు 12తులాల బంగారం ఉన్నట్లు గుర్తించారని సమాచారం. ఆ వ్యక్తులు ఎవరు..? ఎక్కడి నుంచి వచ్చారు..? ఎందుకు వచ్చారు..? బంగా రం ఎక్కడిది అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. దీనిపై ఎస్ఐ శ్రీనును వివరణ కోరగా సరైన సమాచారం లేదని విచారిస్తున్నామని చెప్పారు.

సాగర్ ప్రాజెక్టు నిండుకుండలా ఉన్నా..

పంటలకు నీరు వదలరా?

● అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై రైతుల రాస్తారోకో



అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మాడ్గులపల్లి, ఆగస్టు 29: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా ఉన్నా నీరు వదలడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కుక్కడం, అబంగాపురం, ఐలాపురం, పూసలపాడు గ్రామాల రైతులు గురువారం మండలంలోని కుక్కడం గ్రామంలో అద్దంకి నార్కట్‌పల్లి రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదకాల్వ ద్వారా 50వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు 85 కిలోమీటర్ల మేరా కాల్వ నిర్మించినా నీరు కిందకు రాకపోవడంతో పెట్టిన పంటలకు నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాధారం, బోరుబావుల మీద ఆధారపడి రైతులు పంటలు సాగు చేసినా వరదకాల్వ నీరు రాకపోవడంతో బోరుబావులు ఎండిపోతున్నాయన్నారు. వరదకాల్వ పెద్దవూర మండలం పుల్యాతండా నుంచి ప్రారంభమై హాలియా, నిడమనూరు, కనగల్, మాడ్గులపల్లి, వేములపల్లి మండలంలోని మొల్కపట్నం వరకు సాగునీటిని అందించడంతోపాటు చెరువులను నింపేందుకు నిర్మించారని, మాడ్గులపల్లి మండలంలోని కన్నెకల్ నుంచి నారాయణపురం, యాచారం, చెరుపల్లి, మాడ్గులపల్లి, కుక్కడం, తోపుచర్ల, మొల్కపట్నం వరకు 13వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కాల్వలు ఉన్నా నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కిందకు నీటిని విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న పోలీసులు రైతుల వద్దకు వచ్చి మాట్లాడారు. నీటిపారుదలశాఖ అధికారులతో మాట్లాడి నీటిని కిందకు పంపిస్తామని ఫోన్‌లో మాట్లాడడంతో రైతులు ఆందోళన విరమించారు. పావుగంట సేపు నిరసన వ్యక్తం చేయడంతో కిలో మీటర్ మేరా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

బోరు బావిలో పడి వ్యక్తి మృతి



వెంకటేష్ (ఫైల్)

అడ్డగూడూరు, ఆగస్టు 29: వ్యవసాయ బోరు బావిలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం లోని లక్ష్మీదేవికాల్వలో గురువారం జరిగింది. ఎస్‌ఐ నాగరాజు, స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పర్రెపాటి సైదులు, లక్ష్మీ దంపతులు, కూమారుడు వెంకటేష్(27) కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మోటారు నీళ్ల పోయక పోవడంతో తండ్రి సైదులుతో కలిసి వెంకటేష్ గురువారం వ్యవసాయ బోరు బావి వద్దకు వెళ్లాడు. బావి మధ్యలో ఉన్న మోటారుకు కంట్రోల్ వాచర్ అమరుస్తుండగా వెంకటేష్ కాలు జారి బావిలో పడిపోయాడు. గమనించిన తండ్రి సైదులు కేకలు వేయడంతో చుట్టు పక్కల ఉన్న రైతులు అక్కడికి చేరుకొని తాళ్లసాయంతో బావిలోకి దిగారు. వెంకటేష్‌ను బయటికి తీసుకొచ్చారు. అప్పటికే ఆయన మృతిచెంది ఉన్నాడు. రైతులు పోలీసులకు సమాచారం సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెంటేష్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్నేహితులతో ఆడుకుంటూ..



ఈశ్వర్(ఫైల్)

కొండమల్లేపల్లి: స్నేహితులతో కలిసి ఆడుకుంటున్న క్రమంలో నీటి సంపులో పడి బాలుడు మృతిచెం దాడు. ఈ సంఘటన గురువారం రాత్రి నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలకేంద్రంలో జరిగిది. ఏపీ రాష్ట్రం కర్నూల్ జిల్లాకు చెందిన చాకలి వీరస్వామి-ఉమ దంపతులు బతుకు దెరువు కోసం మూడు సంవత్సరాల క్రితం మండలకేంద్రానికి వచ్చి తాపీ మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఈశ్వర్(6) ఉన్నారు. గురువారం రాత్రి స్థానిక పాతూరిలో గల ఆంజనేయస్వామి ఆలయం సమీపం లో ఈశ్వర్ సేహితులతో ఆడుకుంటుండగా పక్కనే ఉన్న నీటిసంపులో పడ్డాడు. గమనించిన చిన్నారులు చుట్టుపక్కల వారికి చెప్ప డంతో వారు వెంటనే వచ్చి బాలుడిని సంపు నుంచి బయటకు తీశారు. చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రాంమ్మూర్తి తెలిపారు.

28 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

మునగాల రూరల్, ఆగస్టు 29: సూర్యాపేట జిల్లా మునగాల మండల ప రిధిలోని వెంకట రాంపురంలో గురువారం తెల్లవారుజామున 28 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకా రం.. గ్రామశివారులోని కోళ్లఫారం పక్కన ఉన్న షెడ్డులో పీడీఎస్ బియ్యం బస్తా లు డంప్ చేసి ఉన్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు పోలీ సులు తని ఖీలు నిర్వహించారు. 64బస్తాల్లో 28క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మండల పరిధిలోని నేలమర్రి గ్రామానికి చెందిన గుడిపూడి నగేష్ తక్కువ ధరకు రేషన్‌బియ్యం కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి వ్యాపారం చేస్తున్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

26 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

● ఎగువ నుంచి 3,48,235 క్యూసెక్కుల వరద రాక



నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్‌గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, దామరచర్ల, ఆగస్టు 29: నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వరద రాక పెరగడంతో బుధవారం అర్ధరాత్రి నుంచి 22 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేసిన అధికారులు గురువారం ఉదయం 9గంటలకు 24 క్రస్ట్ గేట్ల ద్వారా, 10గంటలకు 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగిస్తున్నారు. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,86,434 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం 885అడుగులు కాగా, ప్రస్తుతం 884.80 అడుగులుగా(214.3633టీఎంసీలుగా) ఉంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు 10క్రస్ట్ గేట్లను 10అడుగుల మేరకు ఎత్తి 2,79,830 క్యూసెక్కుల నీటిని, కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 30,523 క్యూసెక్కుల నీటిని, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 37,882 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు మొత్తం 3,48,235 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 590 అడుగులు (312.0450టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 9,382 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 8280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,461 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని, మొత్తం 26 క్రస్ట్ గేట్లల్లో 14 క్రస్ట్ గేట్లను 10అడుగుల మేరకు, 12 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 3,07,382 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 3,55,910 నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 3,48,235 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల ప్రాజెక్టు 14 గేట్లు ఎత్తివేత

తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం పెరగడంతో 14 గేట్లను ఎత్తి 3,24,393 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు(45.77 టీఎంసీలు) కాగా, గురువారం సాయంత్రానికి 171.91అడుగులు (41 టీఎంసీలు)గా నమోదైంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 2,75,393 క్యూసెక్కులుగా నమోదైంది. తెలంగాణ జలవిద్యుత్ కేంద్రం నుంచి నాలుగు యూనిట్ల ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 102 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుండగా, మొత్తం ప్రాజెక్టు అవుట్‌ఫ్లో 3,40,393 క్యూసెక్కులుగా నమోదైంది. ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కంటే ఔట్‌ఫ్లో అధికంగా నమోదైంది.

నిలకడగా మూసీ నీటిమట్టం

మూసీ ప్రాజెక్టుకు నీటిమట్టం 643.40అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతోంది. వారం రోజుల పాటు ఎగువ నుంచి మోస్తరుగా ఉన్న ఇన్‌ఫ్లో రెండు రోజులుగా తగ్గింది. దీంతో మూసీ ప్రాజెక్టు నీటిమట్టంలో హెచ్చుతగ్గులు లేకుండా నిలకడగా కొనసాగుతోంది. ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలో వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 503క్యూసెక్కులుగా నమోదైంది. 645అడుగుల (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం ఉన్న మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.40అడుగులు(4.04టీఎంసీ)గా ఉంది. మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు ప్రాజెక్టు కుడి కాల్వకు 239.40క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 263.34 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తంగా మూసీ నుంచి 502.74 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

ఎగువ నాగార్జునసాగర్ నుంచి పెద్దఎత్తున దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో గురువారం అడవిదేవులపల్లి మండలకేంద్రం శివారులోని టెయిల్ పాండ్ నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం నుంచి టెయిల్ పాండ్‌కు 3,35,843 క్యూసెక్కుల నీరు టెయిల్‌పాండ్‌కు వస్తోంది. దీంతో టెయిల్ పాండ్‌లోని 16గేట్లను 4మీటర్ల మేరా ఎత్తి 3,31,680 క్యూసెక్కుల నీటిని దిగువ పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి



తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న కృష్ణ

కేతేపల్లి, ఆగస్టు 29: నిద్ర మత్తు ఒకరి ప్రాణం తీసింది. కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టడంతో ఒకరు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా పడ్డారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలకేంద్రంలో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన సొంటి కృష్ణసంతోష్ విజయవాడలో తన మేనత్త అంత్యక్రియలకు హాజరయ్యేందుకు తల్లిదండ్రులు దుర్గామల్లేష్ ప్రసాద్, శివనాగమల్లేశ్వరి(63), మేనత్తలు పామర్తి పార్వతి, గుడిపల్లి అలివేలమ్మలతో కలిసి గురువారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు బయల్దేరారు. కారు ఉదయం ఆరు గంటల సమయంలో కేతేపల్లికి చేరేసరికి కారు నడుపుతున్న సొంటి కృష్ణను నిద్రమత్తు ఆవరించింది. దీంతో అదుపు తప్పిన కారు కేతేపల్లి డీపాల్ స్కూల్ వద్ద గల జంక్షన్‌లోకి దూసుకెళ్లి డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. ప్రమాదధాటికి కారు ముందు ఎడమ చక్రం విరిగి దూరంగా పడింది. కారులోని ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో ముందు సీట్లలో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు వెను సీటులో కూర్చున వారిలో సొంటి కృష్ణసంతోష్ తల్లి శివనాగమల్లేశ్వరి(63) ప్రమాద తీవ్రతకు భయాందోళనకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదంలో గాయపడిన దుర్గామల్లేష్ ప్రసాద్, పామర్తి పార్వతి, గుడిపల్లి అలివేలమ్మలను చికిత్స నిమిత్తం నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివతేజ వివరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

సంస్థాన్ నారాయణపురం: యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని గుడిమల్కాపురం శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన పందిరి రాములు(59) తన మనవడి బారసాల కోసం బుధవారం మోపెడ్ వాహనంపై చౌటుప్పల్ మండలం తంగడపల్లి గ్రామానికి వచ్చాడు. గ్రామంలో ఇంటి దగ్గర నిర్మాణ పనులకు సంబంధించి కూలీలు వస్తారని గురువారం తెల్లవారుజామున తన మోపెడ్ వాహనంపై ఇంటికి బయలుదేరాడు. మండలంలోని గుడిమల్కాపురం గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనాదారులు గుర్తించి పోలీసులకు సమచారం అందించారు. పోలీ సులు సంఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగన్ తెలిపారు.

పెళ్లి పత్రికలు పంచడానికి వెళ్తూ..

పెద్దఅడిశర్లపల్లి: అక్క పెళ్లికార్డులు పంచడానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో సోదరుడి స్నేహితుడు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిలోని చిలకమర్రి స్టేజీ సమీపంలో గురువారం జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం పల్లెతండకు చెందిన కేతావత్ సంతోష్ అక్క అయిన అనూష పెళ్లి ఈ నెల 31న జరగాల్సి ఉంది. దీంతో పెళ్లి పత్రికలు పంచడానికి గురువారం రాత్రి సంతోష్ తన స్నేహితుడు నేనావత్ రాజేష్(19)ను వెంటబెట్టుకుని నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పరిధిలోని నాగార్జునపేటతండాకు బైక్‌పై బయలుదేరారు. పెద్దఅడిశర్లపల్లి మండలం కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిలోని చిలకమర్రి స్టేజీ సమీపంలో స్పీడ్ బేకర్ల వద్ద రాగానే బైక్ అదుపుతప్పి గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొని వాహనం నడుపుతున్న నేనావత్ రాజేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన సంతోష్‌ను కొండమల్లేపల్లి నుంచి వస్తున్న గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. రాజేష్ మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొని బీఫార్మసీ విద్యార్థిని మృతి

గరిడేపల్లి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీఫార్మసీ విద్యార్థిని మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం గణపవరం గ్రామానికి చెందిన పిడమర్తి స్రవంతి కోదాడలోని తేజ కళాశాలలో బీఫార్మసీ ఫైనలియర్ చదువుతోంది. పాలకవీడు మండలం గుడుగుంట్ల పాలెం గ్రామానికి చెందిన తన బంధువైన బంక నాగరాజు బైక్‌పై స్రవంతిని ఎక్కించుకొని గుడుగుంట్లపాలెం గ్రామానికి కోదాడ నుంచి బయలుదేరారు. కోదాడ మిర్యాలగూడెం ప్రధాన రహదారిపై సాయంత్రం 4గంటల సమయంలో గరిడేపల్లి మండల పరిధిలోని అప్పన్నపేట గ్రామ శివారులోకి రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ డ్రైవర్ మద్యం మత్తులో నాగరాజు బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్ వెనుకాల కూర్చున్న స్రవంతి(19) అక్కడికక్కడే మృతి చెందింది. నాగరాజుకు తీవ్ర గాయాలు కావడంతో 108లో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నాగరాజు కోదాడలోని ప్రైవేట్ హాస్టల్‌లో వార్డెన్‌గా పని చేస్తున్నట్లు సమాచారం. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ చలిగంటి నరేష్ తెలిపారు.

ట్రాక్టర్ ఎదురుగా రావడంతో..



చివ్వెంల: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలకేంద్రం శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలం సిరికొండ గ్రామానికి చెందిన బోడపట్ల జానుగౌడ్ (42)ద్విచక్ర వాహనంపై సూర్యాపేట జిల్లాకేంద్రానికి వస్తున్నాడు. చివ్వెంల మండలకేంద్రం శివారులోని దీవెన కళాశాల సమీపంలో ట్రాక్టర్ ఎదురుగా వచ్చి ఢీకొంది. దీంతో జానుగౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో మృతిచెందాడు. జానుగౌడ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్య చేతిలో భర్త హతం



హత్యకు గురైన వెంకన్న

నల్లగొండ క్రైం, ఆగస్టు 29: ప్రియుడి మోజులో భర్తను హత్య చేసిన సంఘటన నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ వన్‌టౌన్ స్టేషన్ పరిధిలోని ఏఆర్‌నగర్‌కు చెందిన ఓర్సు వెంకన్న(55) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య ఓర్సు షైసమ్మ వెలుగుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. వారి ఏకాంతానికి అడ్డుగా వస్తున్న భర్తను హత్య చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగా బుధవారం రాత్రి సమయంలో ఏఆర్‌నగర్‌లోని వారు నివాసం ఉండే ఇంట్లో ఇరువురు ఘర్షణ పడ్డారు. దీంతో వెంకన్నను బలంగా నెట్టివేయగా వెనకకు పడటంతో రాయి తగిలి తలకు గాయమైంది. ఇదే అదునుగా భావించిన వెంకన్న భార్య షైసమ్మ అతడి ఛాతిపై కూర్చొని బలంగా గొంతునులమడంతో ప్రాణాలు కోల్పోయాడు. వెంకన్న చనిపోయాడు అని నిర్ధారించుకున్న తర్వాతే షైసమ్మ అతడి ఛాతిపై నుంచి లేచి తన భర్త చనిపోయాడని నమ్మించే ప్రయత్నం చేసేందుకు కాలనీవాసుల వద్ద బోరున విలపించింది. షైసమ్మకు వెలుగుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి వివాహేతర సంబంధం ఉన్నట్లు కాలనీవాసులకు కూడా తెలవడంతో వారు అనుమానం వ్యక్తం చేశారు. ఆరునెలల క్రితం నుంచి భార్యాభర్తల మధ్య వివాదాలు జరుగుతుండగా, షైసమ్మ తన తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. షైసమ్మ భర్త వెంకన్న ఆమె వద్దకు వెళ్లి బతిమిలాడి తిరిగి తీసుకువచ్చుకున్నాడు. అయినా వారి కుటుంబంలో పలుమార్లు ఈ విషయంపై వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. బుధవారం సాయంత్రం సమయంలో కూడా షైసమ్మ వెలుగుపల్లి గ్రామానికి చెందిన తన ప్రియుడితో కలిసి వెంకన్నను హత్య చేసేందుకు చర్చించినట్టు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెంకన్నకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడి అన్న కుమారుడు ఓర్సు శ్రీను ఫిర్యాదు మేరకు నల్లగొండ వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షరతులు లేకుండా ప్రభుత్వం

రుణమాఫీ చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ టౌన్, ఆగస్టు 29: కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి షరతులు, ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణాలు మాఫీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రూ.2లక్షల రుణమాఫీ అనేది సహోసపేతమైన నిర్ణయమని అన్నారు. తొలత ప్రతి రైతుకూ రూ.2 లక్షలు అని చెప్పిన ప్రభుత్వం తర్వాత రైతు కుటుంబానికి అని మాట మార్చిందని, అది కూడా అందరికీ మాఫీ చేయడం లేదన్నారు. రుణమాఫీ కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 567 అనేక నిబంధనలు విధించడంతో రైతులు రుణమాఫీ పొందలేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.22లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లకు పైగా జమ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో ఏక కాలంలో రూ.2లక్షలు మాఫీ చేస్తామని ప్రకటించారన్నారు. రుణమాఫీ 40శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. రైతులు బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నారన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం రుణం తీసుకున్న ప్రతిరైతుకు రుణమాఫీ వర్తింపచేయాలన్నారు. అలాగే రైతుభరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పలు జిల్లాలో క్యాబినేటు సబ్ కమిటీ అభిప్రాయాలు సేకరించిన రైతు పెట్టుబడికి భరోసా నిధులను ఎందుకు విడుదల చేయడంలేదని ప్రశ్నించారు. విధివిధానాలు ఎప్పుడైనా తయారు చేసుకోవచ్చని వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సివస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు బీమా పథకానికి సంబంధించిన ప్రీమియం వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం లాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కాలయాపన చేస్తే తగిన సమయంలో రైతులు ప్రభుత్వానికి బుద్ధిచెబుతారని అన్నారు. ఆందోళనలో ఉన్న రైతులకు ప్రభుత్వం భరోసా కల్పించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు 5లక్షల 42 వేల 306 ఉండగా ఇప్పటి వరకు 1,71,781 మంది రైతులకకు రుణమాఫీ అయిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండ శ్రీశైలం, కందాల ప్రమీల, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాషం, సిహెచ్ లక్ష్మీనారాయణ, వీ. వెంకటేశ్వర్లు, ఎండి సలీం, పి. నర్సిరెడ్డి, అవిశెట్టి శంకరయ్య, జిట్టా నగేష్, బొజ్జ చిన్నవెంకులు, ఎం రవినాయక్, కంబాలపల్లి ఆనంద్, నన్నూరి వెంకటరమణారెడ్డి, దండెంపల్లి సత్తయ్య, రొండి శ్రీనివాస్, వెంకన్న, నాంపల్లి చంద్రమౌళి, మల్లం మహేష్, సరోజ, పద్మ, సైదులు, మన్నెం బిక్షం, గోవర్ధన, కుంభం క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు రక్షణ కరువు

● ఎలుకలు, క్రిమికీటకాలతో ఇబ్బందులు ● పట్టించుకోని అధికారులు ● గురుకులాలకు ప్రహరీలు కరువు



ప్రహరిలేని కొమ్మెపల్లి గిరిజన బాలుర గురుకుల పాఠశాల

దేవరకొండ, ఆగస్టు 29: నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్‌లో గురుకుల పాఠశాలల విద్యార్థులకు రక్షణ కరువైంది. పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో క్రిమికీటకాలు, ఎలుకలు పాఠశాలలోకి వచ్చి నిద్రిస్తున్న విద్యార్థులను కరుస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. డిండి మండలంలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో జూలై నెలలో 16 మంది విద్యార్థులను ఎలుకలు కరవడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆ సంఘటన మరువకముందే తాజాగా దేవరకొండ మండలం కొండభీమనపల్లి బీసీ గురుకుల పాఠశాలలో ఈ నెల 26న నిద్రిస్తున్న 14మంది విద్యార్థులను ఎలుకలు కరిచాయి. దీంతో విద్యార్థులు భయాందోళన చెందడంతో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హుటాహుటిన వాహనాల్లో సమీపంలోని తూర్పుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సకాలంలో విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం అందడంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది. దేవరకొండ మండలం కొమ్మెపల్లి గిరిజన గురుకుల పాఠశాలలో ప్రహరీ లేకపోవడంతో తేళ్లు, పాములు రాత్రివేళలో పాఠశాల ఆవరణంలోకి వస్తున్నాయని విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలకు ప్రహరీ మంజూరైనా నిధులు కేటాయించకపోవడంతో పను లు ప్రారంభంకాలేదు. కొండమల్లేపల్లి ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో సైతం కోతులు, కుక్కల బెడద అధికంగా ఉండడంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రహరీ నిర్మించి రక్షణ కల్పించాలని విద్యార్థులతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

పాములు, తేళ్లు వస్తున్నాయి

కొమ్మెపల్లి గిరిజన గురుకుల పాఠశాల ప్రహరిగోడలేకపోవడంతో పాములు, తేళ్లు వస్తున్నాయి. రాత్రివేళలో బయటకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి. ప్రహరిగోడ నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

జయరాం, ఇంటర్ విద్యార్థి కొమ్మెపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల.

తనిఖీచేసి సమస్యలు పరిష్కరిస్తాం

దేవరకొండ డివిజన్‌లోని డిండి, కొండభీమనపల్లి గురుకుల పాఠశాలల్లో ఎలుకలు విద్యార్థులను దాడి చేసిన సంఘటన పునరావృతం కాకుండా చర్యలు చేపడుతాం. విషయాన్ని కలెక్టర్‌తోపాటు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి రక్షణ చర్యలు చేపడుతాం.

● శ్రీరాములు, దేవరకొండ ఆర్డీవో

హామీ మరిచిన అధికారులు



ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

వేములపల్లి, ఆగస్టు 29: ఉన్నతాధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీ 15రోజులు అవుతున్నా సమస్యలను పరిష్కరించలేదని వేములపల్లి ఆదర్శ పాఠశాల హాస్టల్ విద్యార్థినులు గురువారం తరగతులను బహిష్కరించి ఆందోళన చేశారు. మధ్యాహ్న భోజనాన్ని సైతం చేయకుండా నిరసన వ్యక్తం చేశారు. పాఠశాల ముగిసిన తర్వాత కూడా ప్రధాన ద్వారం వద్ద కూర్చొని ఉపాధ్యాయులను బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీసీడీవో సరిత, ఎంఈవో బాలాజీనాయక్‌లు తమ హాస్టల్ ప్రాంగణం నుంచి కస్తూర్బా విద్యార్థినిలను ఆగస్టు 15 తర్వాత మరో చోటుకు తరలిస్తామని అప్పటి వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యను పరిష్కరిస్తామని లిఖిత పూర్వకంగా హామి ఇచ్చి తమ పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడంతోనే మరోమారు ఆందోళన చేయాల్సి వచ్చిందన్నారు. అయినప్పటికీ జీసీడీవో, ఎంఈవోలు తమ ఆందోళన పట్ల అంటిముట్టనట్లుగా వ్యవహరించడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నామన్నారు. సుమారు నెల రోజులుగా చాలిచాలని గదుల్లో తీవ్ర ఇబ్బందుల మధ్య చదువులను కొనసాగించాల్సి వస్తుందని, సరైన వసతులు లేక డైనింగ్ హాల్‌లో తిని డైనింగ్ హాల్‌లోనే పడుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 29: చౌటుప్పల్ మునిసిపాలిటీలో గురువారం ముత్యాలమ్మ బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మునిసిపాలిటీలోని చౌటుప్పల్, లక్కారం, తంగడపల్లి, తాళ్లసింగారం, లింగోజీగూడెంలలో బొడ్రాయిల వద్ద ప్రత్యేక పూజలను చేశారు. ముత్యాలమ్మ దేవాలయాల్లో గణపతి, నవగ్రహ పూజలు, దుర్గా హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మ ఆలయాల్లో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, గ్రంతాలయ



చౌటుప్పల్‌లో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మాజీ చైర్మన్ ఊడుగు మల్లేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు బడుగు లక్ష్మయ్య, బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డు రేవతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : సంస్థాన్‌నారాయణపురం మండలంలో ప్రజలు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి ముత్యాలమ్మ, దేవతామూర్తులకు బోనాలు నైవేద్యాన్ని సమర్పించారు .

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మునిసిపల్ పరిధిలోని కొత్తగుండ్లపల్లి, పాతగుండ్లపల్లి, బీసీ కాలనీ ప్రాంతాలకు చెందిన ప్రజలు గురువారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు సామూహిక బోనాలు నిర్వహించి, గ్రామదేవతలు నల్లపోచమ్మ, ఎర్రపోచమ్మ ఆలయాల వరకు ఊరేగించి నైవేద్యాన్ని సమర్పించారు. ఈసందర్భంగా డప్పుచప్పుళ్లు, శివసత్తుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని నల్ల పోచమ్మ ఆలయంలోని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా నల్లపోచమ్మదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో దేవాలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు, కట్కూరి పాండురంగంగౌడ్, గౌరవాధ్యక్షుడు కొయ్యడ నర్సింహగౌడ్, గునిగంటి మల్లేష్‌గౌడ్, తండ వెంకటేష్‌గౌడ్, మక్తాల పోచయ్యగౌడ్, ఉపాధ్యక్షులు డబ్బీకార్ సాయేష్‌కుమార్, బోగ చంద్రశేఖర్, మంగళపల్లి రాజారమేష్, ప్రధాన కార్యదర్శి బొడిగె లింగంగౌడ్, కోశాధికారి మాటూరి రామకృష్ణముదిరాజ్, సహాయ కార్యదర్శులు బొడిగె బాబు గౌడ్, శ్రీనివాస్‌ముదిరాజ్, కీర్తి భాస్కర్, వంగూరి పాండు పాల్గొన్నారు.

వలిగొండ: మండల కేంద్రంలో పద్మశాలీల ఆధ్వర్యంలో మద్దెలమ్మ తల్లి బోనాల పండుగ ఘనంగా జరిగింది. మండల వ్యాప్తంగా ప్రొద్దటూరు, వర్కట్‌పల్లి, వేములకొండ గ్రామాల్లో గ్రామ దేవతల బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. నాయకులు అయిటిపాముల కుమార్, రవీంద్ర, సాయిని యాదగిరి, తవుటం నరహరి, గంజి నారాయణ, అయిటిపాముల ప్రభాకర్, సత్యనారాయణ, జెల్ల నందు రచ్చ శ్రీను, మిర్యాల వెంకటేశం, బాల నర్సింహ పాల్గొన్నారు.

రామన్నపేట: మండల కేంద్రంలో వడ్డెర కులస్థులు ఘనంగా బోనాల వేడుకలను నిర్వహించారు. దుర్గామాత ఆల యం వరకు ఊరేగింపు నిర్వహించి, అమ్మవారికి బోనాలను సమర్పించారు.

అడ్డగూడూరు: మండలంలోని మానాయికుంట గ్రామంలో గురువారం గ్రామ దేవతైన గంగదేవతకు గ్రామస్థులు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రస్తుత గుడి శిధిలావస్థకు చేరడంతో నూతన గుడి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించుకున్నామని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి ఒక్కరు చొప్పున బిందెల్లో నీళ్ల తెచ్చి గుడిని శుభ్రం చేశారు. అలాగే వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని రైతులు గంగదేవతను కోరారు.



చిమిర్యాలలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు



చౌటుప్పల్‌లో ముత్యాలమ్మ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు దంపతులు



రామన్నపేటలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు



యాదగిరిగుట్టలో బోనాలతో వెళుతున్న భక్తులు



అడ్డగూడూరు: మానాయికుంటలో జలబిందెలతో వెళుతున్న భక్తులు



వలిగొండలో బోనాలతో వెళుతున్న మహిళలు

వీరులగన్న గడ్డ పిలాయిపల్లి

● సాయుధ..కలం యోధుడు వీరారెడ్డి పేరిట స్మారక భవనం ప్రారంభం నేడు



వీరారెడ్డి పేరిట నిర్మించిన స్మారక భవనం ఇదే.. ఇన్‌సెట్లో వీరారెడ్డి ఫైల్‌ఫొటో

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 29: భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం కమ్యూనిస్టుల నాయకత్వంలో ఆనాడు సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఎన్నో పల్లెలనుంచి యువకులు కొదమ సింహాలై కదిలారు. భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామంలో అనేక మంది యువకులు సాయుధ పోరాటం చేరారు. అందులో భూస్వామ్య కుటుంబంలో జన్మించిన కళ్లెం వీరారెడ్డి దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే పిలాయిపల్లి గ్రామంలో గురుకుల పాఠశాలను ప్రారంభించి ఎందరికో విద్యా బుద్ధులు నేర్పించిన విద్యా వేత్త.. అనంతరం కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన సాయుధ పోరాటం వైపు నిలిచారు. దున్నేవాడికి భూమి పంచాలనే నినాదంలో తాను కూడా పేదలకు భూమిని పంచి ఆదర్శంగా నిలిచారు. పిలాయిపల్లి గ్రామంలో కళ్లెం జానకమ్మ-లక్ష్మారెడ్డి దంపతులకు ప్రథమ సంతానంగా 1882లో వీరారెడ్డి జన్మించారు. తన తొమ్మిదో ఏటనే గ్రామంలో కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు. 1929వ సంవత్సరంలోనే విద్యాభివృద్ధికి గ్రామంలో గురుకుల పాఠశాల స్థాపించి ఆదర్శంగా నిలిచారు. గురుకుల పాఠశాల ప్రారంభోత్సవానికి మాడపాటి హనుమంతరావు, వీర తెలంగాణ పోరాట రథసారథి, రైతు కూలీల హక్కుల పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. వీరారెడ్డి ఉన్నత విద్యను అభ్యసించి పోలీసు పటేల్‌గా విధులు నిర్వహించారు. ఆనాడే నిజాం సర్కారుకు వ్యతిరేకంగా పోరాటం చేసి ప్రజల పక్షాన నిలిచారు. 1940లోనే ఆయన పిలాయిపల్లిలో ఒక పాఠశాలను స్థాపించిన మహనీయుడు. ప్రవీణులైన ఉపాధ్యాయులను నియమించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం పొందకుండా ఆయన తన అనుచరుల నుంచి చందాలు పోగేసి ఉపాధ్యాయులకు వేతనాలు ఇచ్చి పాఠశాలను నడిపించారు.. కుల వివక్ష ను వ్యతిరేకించి ఆయన కులాంతర వివాహం చేసుకుని ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. నిజాం సర్కారు ప్రవేశపెట్టిన వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాడుతూ దున్నేవాడికి భూమి కావాలన్న ఆశయ సాధనకు అనుగుణంగా పనిచేశారు. 1949-50 సంవత్సరంలో గ్రామంలో తన కుటుంబానికి చెందిన భూమితో పాటు 100ఎకరాలను భూమిని పేదలకు పంపిణీ చేశారు. కమ్యూనిస్టు పార్టీ చీలిక సమయంలో సీపీఎం వైపు మొగ్గు చూపారు. 1971లో సుమారు 150 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేశారు. ఆయన తుది శ్వాస విడిచేవరకు కష్టజీవుల పక్షానే నిలిచారు. ఆ పోరాట యోధుడి స్మారకార్థం సీపీఎం ఆధ్వర్యంలో స్మారకం భవనం నిర్మిచారు. ఆభవనం ఈనెల 30వ తేదీన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభించనున్నారు. ఇందుకోసం పార్టీ మండల శాఖ అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసింది.

సంక్షిప్తంగా..

మోత్కూరు : రేషన్‌కార్డు లేకపోవడం, ఇతర సాంకేతిక కారణాలతో రుణమాఫీ వర్తించని రైతుల కుటుంబాలను నిర్ధారించి, యాప్‌లో అప్‌లోడ్ చేయడానికి గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అనాజిపురం, పాటిమట్ల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో వి.కీర్తి మాట్లాడుతూ అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుందన్నారు.

చౌటుప్పల్ రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధం కావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. మండల పరిధిలోని చిన్నకొండూర్ గ్రామశాఖ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. నాయకులు పబ్బురాజుగౌడ్, చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, దేవేందర్, అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: స్కిల్ ఇండియా సహకారంతో సఫల్ సంస్థ నిర్వహిస్తున్న రెండు రోజుల ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్ అన్నారు. భువనగిరిలో ఆయన శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గంజి రమేష్, రిసోర్స్ పర్సన్ ఎర్ర శివాజీ, వెంకటేష్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

వలిగొండ: విద్యాభివృద్ధికి దివీస్ అందిస్తున్న సహకారం అభినందనీయమని గోకారం పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తిరుపతమ్మ, మాజీ సర్పంచ్ తుర్కపల్లి మాధవీసురేందర్ అన్నారు. మండలంలోని గోకారం, జాలుకాలువ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దివీస్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో రూ.3,31, 444విలువైన నోట్ బుక్స్, స్కూల్ బ్యాగులు వాటర్ బాటిల్స్, శ్యాండిల్స్‌ను అందజేశారు.

వలిగొండ: ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాల్వల వెంట రైతులు వేసిన మోటార్లు, విద్యుత్ కనెక్షన్లను తొలగించాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య మండల కార్యదర్శి సిరిపంగి స్వామి కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో చౌటుప్పల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కాల్వల కింద సన్న, చిన్న కారు రైతులు, విద్యుత్ అనుమతులు తీసుకుని మోటార్లు బిగించుకొని వ్యవసాయం చేస్తున్నారని అన్నారు. నాయకులు కిష్టయ్య, సురేష్, బుచ్చిరెడ్డి, శంకరయ్య, బాలయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని మొగిలిపాక గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పబ్బు వెంకటేశం హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. మహేష్, రాఘవ్, బాబు ఉన్నారు.

రాజాపేట: గణేష్ ఉత్సవాలకు ప్రజలందరూ సహకరించాలని రాజాపేట ఎస్ఐ ఉపేందర్ యాదవ్ కోరారు. రాజాపేట పోలీస్ స్టేషన్‌లో నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

రాజాపేట: మండలంలోని పాముకుంట గ్రామంలో విద్యార్థుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పాముకుంట గ్రామ అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు రాపోలు విశ్వాస్‌రెడ్డి తెలిపారు. చెవి, ముక్కు, గొంతు పరీక్షలు నిర్వహిస్తారని, విద్యార్థులందరూ వినియోగించుకోవాలని కోరారు.

భువనగిరి అర్బన్ : జిల్లాలోని లబ్ధిదారులకు వివిధ రకాల పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు డీఆర్డీవో టీ.నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చేయూత, ఆసరా, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళ, బీడీ కార్మికులు, టేకేదారులు వచ్చే నెల 4 వరకు జిల్లాలో తపాల కార్యాలయాల ద్వారా పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

బొమ్మలరామారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డి కుమారుడు కల్లూరి శ్రీపతి రెడ్డి జ్ఞాపకార్థం మధ్యాహ్న భోజనం కోసం ఆరు క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశారు. నాయకులు పొలగోని వెంకటేష్‌గౌడ్, ప్రిన్సిపల్ శ్రీదేవి, బోనంకూర మల్లేష్, కట్ట శ్రీకాంత్, తిప్పారం భాను ప్రకాశ్, కె.ఉపేందర్, కట్ట ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

బొమ్మలరామారం, ఆగస్టు 29: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆలేరు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని గోవింద్ తండాలో రాజేష్ అనే యువకుడు తన సొంత నిధులతో గోవింద్ తండా మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతారం బొమ్మలరామారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వికలాంగులకు ఉచిత బస్ పాస్‌లను పంపిణీ చేశారు.

ఆర్టీసీ బస్సును సద్వినియోగం చేసుకోవాలి



బస్సును ప్రారంభిస్తున్న డీఎం శ్రీనివాస్‌శర్మ, ఎంఎల్ఎన్.రెడ్డి

భువనగిరి రూరల్, ఆగస్టు 29: ఆర్టీసీ బస్సును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి, ఉప్పల్ డిపో మేనేజర్ హరికీర్తి శ్రీనివాస్ శర్మ కోరారు. భువనగిరి మండలం చందుపట్ల నుంచి సికింద్రాబాద్ వరకు ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సును వారు గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చందుపట్ల నుంచి సికింద్రాబాద్‌కు రోజుకు 3విడతలుగా రాకపోకలు కొనసాగిస్తుందన్నారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ బల్గూరి మధుసూదన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంకల కిష్టయ్య, మాజీ సర్పంచ్‌లు వల్లందాసు ఆదినారాయణ, చిన్నం పాండు, మాజీ ఎంపీటీసీ బొక్క కొండల్‌రెడ్డి, నాయకులు బాలనర్సయ్య, వెంకటేశ్, కృష్ణారెడ్డి, శ్రీశైలం, సురేశ్, నరేష్ ఉన్నారు.

గీత కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

భువనగిరి రూరల్, ఆగస్టు 29: వృత్తిలో ప్రమాదవశాత్తు మృతి చెందిన గీత కార్మికుడి కుటుంబానికి కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థ ఆర్థిక సాయంతో (కేఏఎన్ఎ) ఉపాధి కల్పించినట్లు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు గౌడ్ తెలిపారు. భువనగిరి మండలం ముస్యాలపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు ఈరగాని శ్యాంగౌడ్ ఇటీవల తాటిచెట్టుపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా నిరుపేద కుటుంబానికి ఉపాధి కల్పించేందుకు గాను గురువారం రూ.30వేల విలువ గల బట్టల దుకాణాన్ని (కేఏఎన్ఎ) సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బట్టల దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పి.మైసయ్య, రంగకొండల్, నర్సింహ, వెంకటేశ్, శ్రీనివాస్, భాస్కర్, రాములు, యాదగిరి, హేమలత, మంజుల, మహేశ్వరి తదితరులున్నారు. భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన ఎం.పారిజాత ఇటీవల మృతి చెందింది. ఈసందర్భంగా సర్దార్ సర్వాయిపాపన్న గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు కప్పల రవికుమార్, మండల అధ్యక్షులు నాగెల్లి సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో రూ.5వేల నగదును బాధితురాలి కుటుంబానికి అందచేశారు.

ఫ్రీజర్ బాక్స్ బహూకరణ

అడ్డగూడూరు, ఆగస్టు 29: అడ్డగూడూరు మండలంలోని బొడ్డుగూడెం గ్రామానికి చెందిన చుక్క బాబు, చుక్క సందీప్ వారు ఇద్దరు గ్రామ ప్రజలకు సేవ చేయాలనే తపనతో సొంత ఖర్చులతో ఫ్రీజర్ బాక్స్ ఆ గ్రామనికి చెందిన గ్రామస్థులకు గురువారం బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో ఎవరైన ఆకాల మరణం చెందితే ఫ్రీజర్ బాక్స్‌కోసం గ్రామస్థులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ఫ్రీజర్ బాక్స్ గ్రామానికి అందజేశామన్నారు. అనంతరం ఆ ఇద్దరిని గ్రామస్థులు శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొమ్ము సత్యనారాయణ, నాయకులు వెంపల్ల నర్సిరెడ్డి, చుక్క దేవయ్య ఉన్నారు.

బాధిత కుటుంబానికి వాట్సాప్ గ్రూపు ఆర్థిక సాయం

మోత్కూరు, ఆగస్టు 29: మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీకి చెందిన తాటి అరుణ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారి చదువుల కోసం మన మోత్కూరు వాట్సాప్ గ్రూపు సభ్యులు, దాతల నుంచి సేకరించిన రూ.20,500 చెక్కును గురువారం మృతురాలి కుమారులకు అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, బద్దం నాగార్జునరెడ్డి, దబ్బేటి సోంబాబు, కారుపోతుల వెంకన్న, మర్రి అనిల్, అవిశెట్టి స్వామి పాల్గొన్నారు.

జిల్లాలో పలువురు సీఐలు, ఎస్ఐల బదిలీలు

భువనగిరి టౌన్, ఆగస్టు 29: జిల్లాలోని పలువురు సీఐలు, ఎస్ఐలను బదిలీ చేస్తూ రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌కుమార్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. యాదాద్రి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, చందేపల్లి ఎస్‌హెచ్‌వోగా బదిలీ కాగా ఆయన స్థానంలో పోలీస్ కమిషనరేట్ నుంచి వై.కృష్ణ వచ్చారు. చౌటుప్పల్ ఎస్‌హెచ్‌వో వి.అశోక్‌రెడ్డి సైబర్ క్రైమ్స్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో ఉప్పల్ డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ జీ.మన్మధ కుమార్ బదిలీపై వచ్చారు. భువనగిరి టౌన్ ఎస్ఐ పి.సురేష్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లారు. అలాగే బొమ్మలరామారం ఎస్ఐగా బి.శ్రీనివాస్, ఆలేరు ఎస్ఐగా కె.రజినికర్, మోత్కూర్ ఎస్ఐగా బి.నాగరాజు బదిలీపై వచ్చారు. కాగా నారాయణపూర్ ఎస్ఐ కె.జగన్ మీర్‌పేట్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో చౌటుప్పల్ ఎస్ఐ ఎం.లక్ష్మయ్య వచ్చాడు.

ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలి



భువనగిరిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి టౌన్, ఆగస్టు 29: హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుంటే క్రీడాకారులకు పతకాలు పక్కాగా వస్తాయని మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని గురువారం భువనగిరిలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. పాఠశాల స్థాయిలోనే ఎంపిక చేసుకునే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుంటే భవిష్యత్తులో రాణించవచ్చునన్నారు. క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో భువనగిరి పట్టణ శివారులో అవుట్ డోర్ స్టేడియం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ముందుగా క్రీడా జ్యోతిని వెలిగించి ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పించారు. ఉద్యోగులకు నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా క్రీడల అధికారి కె.ధనాంజనేయులు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాలకృష్ణ, ప్రిన్సిపాల్ పాపిరెడ్డి పాల్గొన్నారు.

మోటకొండూరు : హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాల్లో గెలుపపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, పీఈటీలు మల్లేషం, నవనీత, రాజగోపాల్, భాగ్యశ్రీ, విశ్వరూపం, స్వాతి పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి సేవలు చిరస్మరణీయం



రామన్నపేటలో రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

రామన్నపేట, ఆగస్టు 29: తెలుగు భాష అభివృద్ధికి గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి చిరస్మరణీయమని తెలుగు భాష శతక కర్త మెరుగు మల్లేశం అన్నారు. గురువారం రామన్నపేట డిగ్రీ కళాశాలలో నిర్వహించిన గిడుగు రామ్మూర్తి జయంతిలో ఆయన మాట్లాడారు. తెలుగు భాషలో ప్రావీణ్యం సంపాదించడం భాషా ప్రావీణ్యానికి నిదర్శనమన్నారు. రోజువారీ విధుల్లో తెలుగు భాష వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గిడుగు రామ్మూర్తికి నివాళులర్పించారు. అలాగే ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపల్ రహత్‌ఖాన్, లెక్చరర్లు డాక్టర్ తుండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ జేసి బాబు, డాక్టర్ లక్ష్మీ, నీలిమ, డాక్టర్ సీహెచ్.వెంకట్‌గౌడ్, డాక్టర్ డి.కిషన్, డాక్టర్ జి.సునీత, బసవయ్య పాల్గొన్నారు.


మోత్కూరు : తెలుగు భాష గొప్పదనాన్ని చాటి చెప్పాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని రిటైర్డు హెచ్‌ఎం యాదగిరిలక్ష్మి అన్నారు. గురువారం మోత్కూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ఆంగ్లభాష మోజులో పడి ఎంతో ప్రాశస్త్యం కల్గిన తెలుగు భాషను మరిచిపోతున్నారన్నారు. తెలుగు భాషకు ఉన్న విశిష్టత మరే భాషకూ లేదన్నారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు తొగిటి మనోహరాచారి, వారాల యాదగిరి, ఎం.రాంరెడ్డి, గుమిడెల్లి వెంకన్నలను ఘనంగా సన్మానించారు. తొలుత హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి, సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం డి.అరవిందరాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, ప్రవీణ్, ఎ.వెంకటాచారి, రవి, సుధీర్‌కుమార్, మంజుల, రేవతి, కవిత పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

● సీపీఎం నాయకుల డిమాండ్

● జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, వినతిపత్రాల అందజేత

ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా వ్యాప్తంగా సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు.



భువనగిరి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరి రూరల్, ఆగస్టు 29: రుణమాఫీ కాని సగం మంది రైతులు అయోమయానికి గురవుతున్నారని, వెంటనే గ్రామ సభల ద్వారా సాంకేతిక సమస్యలు పరిష్కరించాలన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రుణమాఫీ కోసం రూ.13వేల కోట్లను విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో రుణమాఫీకి రూ.45వేల కోట్లు అవుతుందని అంచనాకు వచ్చినప్పటికీ రూ.31వేల కోట్ల విడుదల చేస్తామని చెప్పి కేవలం రూ.18వేల కోట్లు మాత్రమే విడుదల చేయడం సరికాదన్నారు. రేషన్ కార్డులు, ఐటీ రిటర్న్, రీ షెడ్యూల్ లాంటివి సవరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ డీఏవో లావణ్యకు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు మాటూరి బాలరాజు గౌడ్, దాసరి పాండు, దయ్యాల నర్సింహ, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మాయ కృష్ణ, ర్యాకల శ్రీశైలం, ఎదునూరి మల్లేశం, కొండమడుగు నాగమణి, పి.అంజయ్య, వెంకటేశ్, ఎల్లయ్య, అశోక్, కృష్ణ, శివ, భాస్కర్, కిష్టయ్య, మైసయ్య, కొండల్, రవి, గోరేమియా ఉన్నారు.

గుండాల : ఎలాంటి షరతులు లేకుండా నిర్ధిష్ట గడువులోగా రుణమాఫీ వర్తింప చేయాలని సిపియం మండల కార్యదర్శి మద్దెపురం రాజు అన్నారు. గుండాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో డీటీ నీలిమకు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు పోతరబోయిన సత్యనారాయణ, అంజయ్య, మహ్మద్ ఖలీల్, మల్లెబోయిన బాలయ్య, లింగయ్య పాల్గొన్నారు.



మోత్కూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



చౌటుప్పల్‌లో ఆర్డీవో శేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మోత్కూరు : మోత్కూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పలు రకాల కొర్రీలు పెడుతూ సగం మంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేదని విమర్శించారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని, వెంటనే రైతులకు రైతు భరోసా అందించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గుండు వెంకటనర్సు, కూరపాటి రాములు, దడిపెల్లి ప్రభాకర్, పసునూరు చంద్రారెడ్డి, కుర్మేటి యాదయ్య, మెతుకు అంజయ్య, కందుకూరి నర్సింహ, పిట్టల చంద్రయ్య, సైదులు, మాంద్ర చంద్రయ్య పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డికి సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సీపీఎం నాయకులు దోనూరు నర్సిరెడ్డి, బూరుగు కృష్ణా రెడ్డి, చీరిక సంజీవ రెడ్డి, శ్రీనివాస్ చారి, బోయ యాదయ్య, గంగదేవి సైదులు, జి.పెంటయ్య, రాజయ్య, స్వామి, పల్లె మధు, కిష్టయ్య, యాదిరెడ్డి, ఆనంద్, ఎ.నందీశ్వర్ లు పాల్గొన్నారు.